# నేను దోషిని!

సారె రామమోహనరావు

హత్యలు, దొంగతనాలు, మాన భంగాలు లాంటి పెద్ద పెద్ద పొరబాట్లు చేస్తే అందుకు ప్రభుత్వం సరయిన శిక్ష విధిస్తుంది. కాని, చిన్న పొరబాట్లు అలా కాదు!....అవి తెలిసి చేసినా తెలియక చేసినా వాటికి ప్రభుత్వ శిక్షలేదు. అచిన్ని పొరబాట్లకు మానవత్వమున్న ప్రతి మనిషి జీవితాంతమూ మానసికంగా శిక్ష అనుభవిస్తాడు. అందుకే ప్రభుత్వ శిక్షగల పెద్ద పొరబాటుకంటే ప్రభుత్వ శిక్షలేని చిన్న పొరబాటే చాలా ఘోర మయినది.

నా పేరు ప్రతిమ.

బి. ఎస్. సి. రిజల్ట్సు వచ్చాయి. నేనుఫస్టు క్లాసులో పాసయ్యాను అమ్మ నాకిక చదువు చాలంది, పెళ్ళి చేస్తానంది. నేను వద్దన్నాను. ఎలాగూ నాన్నగారికి ఇక్కడికి ట్రాన్స్ఫర్ అయింది కదా! అంచేత యూనివర్శిటిలో చేరతానన్నాను. అమ్మ ఓ పట్టాన ఒప్పుకోలేదు. "ఆడ పిల్లలకు అంతంత పెద్ద చదువులెందుకు? ఆ మూడు ముళ్ళూ వేసి మొగుడి వద్ద పడివుంటమే కదా!" అని అంది. ఈ విషయాన్ని నేను నాన్నగారి ముందు పరిచాను. "ఈ రోజుల్లో ఆడాళ్ళకు ఎంత ఎడ్యుకేషన్ వుంటే అంత మంచిది." అని నాన్నగారు అమ్మకు నచ్చజెప్పారు.

ఆ రోజు యూనివర్శిటీకి వెళ్ళటానికి వుదయం ఎనిమిది గంటల సమయాన సిటీబస్సు కోసం ఎదురు చూడసాగాను. ఎంతటికీ బస్సు రాలేదు. చిరాకు వేసింది. అసహనంగా అటూ ఇటూ చూశాను. చుట్టుపక్కల ఎవరూ లేరు. కొద్దిగా దూరంగా వున్న కిళ్ళీషాపు వద్ద నలుగురు వ్యక్తులు టీ తాగుతున్నారు. (అక్కడ టీకూడా అమ్ముతారు)

ఇంతలో నాకు ఎదురుగా రోడ్డుకు అవలి వైపున ఓ యువకుడు వచ్చి నిలబడ్డాడు. టక్ చేసిన టెరికాట్ షర్టు, టెరికాట్ పేంటు వేసుకున్నాడు. కాళ్ళకు ఖరీదయిన షూ వుంది. అక్కడకు

వచ్చినదే తడవు నన్ను చూసి నవ్వ సాగాడు. నన్ను కాదన్నట్లుగా తలతిప్పు కున్నాను. ఓ నిమిషం పోయేక మళ్ళీ చూశాను అతను నన్నుచూసి మళ్ళీ నవ్వాడు.

మళ్ళీ తలతిప్పు కున్నాను.

మళ్ళీ చూశాను

మళ్ళీ నవ్వాడు.

మళ్ళీ మళ్ళీ చూశాను.

మళ్ళీ మళ్ళీ నవ్వాడు.

నాలో కోపంకట్టలు తెంచుకు ప్రవహించింది. గబగబా వాడిని సమీపించాను. "రాస్కెల్! ఒంటరిగా వున్న ఆడదాన్ని చూసి నవ్వుతావా?" అంటూ లాగి చెంప కాయ కొట్టాను.

ఇంతలో కిళ్ళీషాపు వద్ద టీ తాగుతున్న ఆ నలుగురు వ్యక్తులూ మావద్దకు గబ గబా పరుగెత్తుకు వచ్చారు. ఆ నలుగురు వ్యక్తులూ తెల్లని యూనిఫారాలలో వున్నారు

"ఎంతపని చేశావమ్మా!" ఆ నలు గురూ ఒకేసారి అన్నారు.

"నన్నలా అడగటానికి మీ రెవరు? మీరూ నన్ను అల్లరి పెడదామని వచ్చారా?" కోపంగా అడిగాను

"క్షమించండమ్మా! మేము మిమ్మల్ని అల్లరి పెట్టేవాళ్ళం కాదు. మేమిక్కడ పుద్యోగస్తులం" అన్నాడు ఓ వ్యక్తి. అంటే మీరు?...." అనుమానంగా అడిగాను

"మే మిక్కడి మెంటల్ హాస్పిటల్ వార్డు బాయిలం. మీరు చెంప దెబ్బ కొట్టిన ఈయనఇక్కడి పేషెంటు పేరు పార్థసారథి. ప్రముఖ రచయిత. ఈయన ప్రేమించిన అమ్మాయి పెళ్ళి చేసుకుంటానని ఈయనని మోసం చేసింది. ఆ షాకు వలన ఈయనకు మెంటల్ వచ్చింది. అది మొదలు ఒంటరిగా వున్న ప్రతి ఆడదాన్ని చూసి తనలో తానే వేదాంతిలా నవ్వు కుంటాడు. అది చూసి మీరు అపార్థం చేసుకున్నారు. అంతే!" కోపంగాను, బాధగాను అన్నాడు ఓ వార్డుబాయి.

నా నరాలను ఎవరో తోడివేసినట్లని పించింది. బాధతో నా గుండెను ఎవరో నొక్కివేసినట్లనిపించింది. నేను చేసిన తప్పుకు సిగ్గుతో తలదించుకున్నాను

"నన్ను క్షమించండి. తొందర పడ్డాను." బాధగా అన్నాను.

పార్థసారథి ఒక్కసారిగా నా మీద విరుచుకుపడ్డాడు. "యూ డర్టీ గర్ల్! నన్నన్యాయంగా కొడతావా? నువ్వు నన్ను కొట్టిన ఈ పాపానికి నిష్కృతి లేదు. గెటౌట్! గెటౌట్! గెటౌట్!" అంటూ గట్టిగా అరవసాగాడు. ఆ నలు గురు వార్డుబాయ్‌లూ పార్థసారథిని గట్టిగా పట్టుకుని సమీపంలోనే వున్న మెంటల్ హాస్పిటల్ వైపుకు లాక్కుపోయారు.

నా బాధ వర్ణనాతీతం. నేను పార్థ సారథిమీద తొందరపడి చెయ్యి చేసుకు న్నందుకు ఇప్పటికీ బాధ పడుతూనే వుంటాను. ఎప్పటికీ బాధ పడుతూనే వుంటాను. ఆ బాధ నా మరణంతోనే అంతమవుతుంది.

(ఈ కథకి థీమ్ యిచ్చింది ప్రఖ్యాత మానసిక శాస్త్రవేత్త, "విశాఖ మెంటల్ హాస్పిటల్ సూపరింటెండెంటు శ్రీమతి విజయా నాగరాజుగారు.)